# వికసించిన విద్యుత్తేజం

డా. ఆలూరి విజయలక్ష్మి

"రజీ! పుస్తకాలేమైనా వున్నాయా?" దీక్షగా మెడిసిన్ బుక్‌ని చదువుకుంటున్న రజిత తపోభంగమయినట్లుగా తలెత్తింది.

క్వార్టర్స్‌లో యింతమందున్నారు. ఒక్కళ్ళంటే ఒక్కళ్ళకున్నాడా మంచి టేస్టే లేదు ఛీ! ఛీ! చిర్రుబుర్రులాడుతున్న మానసవంక చిత్రంగా చూచింది రజిత. పెథిడిన్ అడిక్ట్‌కి పెథిడిన్ దొరకకపోతే ఎంత విలవిలలాడిపోతాడో 'చరస్' అడిక్ట్‌కి 'చరస్' దొరకకపోతే ఎంత దుర్భరమైన బాధననుభవిస్తాడో, పుస్తకాలు దొరకకపోతే అంతరెస్ట్‌లెస్‌గా అయిపోతుంది మానస.

"మానసా! పి.జి. ఎంట్రెన్స్ అని మనకేదో ఎగ్జామ్ లాంటిది ఉన్నట్లుంది, నువ్వేమైనా విన్నావా?" అమాయకంగా అడిగింది రజిత.

"లక్షణంగావుంది. వాయిదాలమీద వాయిదాలు పడుతూ 'మే' రెండో తేదీకి దేకింది. ఊఁ! అయితేఏంటి?" నుదురు చిట్లించింది మానస.

"అఁహ! మేమంతా రోజుకు పదిహేడు గంటల చొప్పున చదువుతూకూడా ఎమ్.డి. ఎమ్.ఎస్. కాకపోతేమానె, కనీసం డిప్లమోలోనన్నా ప్రవేశం దొరికితే చాలు అని కనపడని దేవుళ్ళందరికీ మొక్కుకుంటూంటే, నువ్వింత కులాసాగా అర్ధరాత్రి పన్నెండు గంటలకు నావెల్స్ వేటలో వద్దావుకదా, అసలు నీ ఉద్దేశమేంటి?..." కొంటెగా నవ్వుతూ మాట్లాడుతున్న రజిత. అవాక్కయిపోయి కళ్ళు వెడల్పుచేసి చూస్తూంది. భళ్ళున తలుపుతోసి పెద్దపెద్ద అంగలేసుకుంటూ లోపలికి వస్తున్నాడొకతను.

"ఆగు ఆగు, ఎక్కడికి? ఇక్కడికెందుకు వచ్చావ్?" భయంతో వణికిపోతూ గావుకేకలు పెట్టింది రజిత నిర్భయంగా అర్ధరాత్రి ఆడపిల్లల క్వార్టర్స్‌లోకి ప్రవేశించింది చాలక గది తలుపులు తోసుకుని రాజాలాగా లోపలికి వస్తున్న ఆగంతకుడివంక, భీతహరిణేక్షణిలా వణ వణ వణుకుతున్న రజితవంక ఆశ్చర్యంగా చూస్తూంది మానస.



ఏయ్ మిస్టర్! ఎవర్నువ్వు? ఏమిటీ జబర్దస్తీ కొంచెం తెప్పరిల్లి కోపంగా అడిగింది మానస.

"ఐవాంట్ మనీమేడమ్" తొణుకు బెణుకు లేకుండా చెప్పాడతను.

"వాట్! నువ్వు స్పృహలోవుండే మాట్లాడుతున్నావా? ... షౌట్! ఐసే గెటవుట్!" ఉరుముతూ గుమ్మం వైపు చూపించింది మానస. ఆమె అరుపులకు రవ్వంతకూడా చలించకుండా గదంతా కలయ చూస్తున్నాడతను. మంచం మీదున్న వానిటీబాగ్ కనపడగానే అటు కదిలాడు,

"రాజేష్! ముందునువ్వు బయటికెళ్ళు బయటికెళ్తె డబ్బిస్తా!" ఆశ పెడుతున్నట్లుగా అతనివంక చూచింది రజిత .ఆమె దీనవదనాన్ని రవ్వంత కూడా గమనించకుండా ఏకదీక్షగా తన లక్ష్యం వైపువెళ్తున్నాడతను. అతను తమను దాటగానే మానస చెయ్యిపట్టుకుని గుంజిలాక్కెళ్తూ పిచ్చి పట్టిన దానిలా 'నైటీతోనే వరండాలో పరుగెత్తసాగింది రజిత. ఆమె పట్టును విడిపించుకుని వెనక్కు చూచేసరికి తన పని చక్కబెట్టుకుని దర్జాగా వెళ్ళిపోతున్నాడతను. రజిత కేకలకు

పుస్తకాలతో కుస్తీ పడుతున్న అమ్మాయిలంతా తలుపులు తీసుకుని వరండాలోకి వచ్చి ఏమిటేమిటని ప్రశ్నలు కురిపించసాగారు,

"రాజేష్ ! డబ్బు !" రొప్పుతూ ఆయాసపడుతూ పలవరించసాగింది రజిత.

"రాజేషా ?! ఇక్కడికూడా వచ్చాడా ? బాబోయ్ ! కళ్ళు వెడల్పు చేస్తూ భయంగా అంది విద్య.

"లైబ్రరీలోనే వీడితో పడలేకుండా వుంటే ఇక్కడికూడా వచ్చి పడిందా పీడిపీడ ?!" అంది మనోజ్ఞ.

"మిమ్మల్నందరినీ గజగజలాడిస్తున్న ఆ క్రొత్త విలన్ ఎవరే ?" చిరాగ్గా అడిగింది మానస.

"గౌరవనీయులైన మన సీనియర్ గారు" పూర్వాశ్రమంలో బొత్తిగా ఏమీ తోచకపోతే కాలేజీకి వేంచేసేవారట ! ఎనాటమీ, ఫిజియాలజీల దగ్గర గజనీ, ఘోరీ మహమ్మద్‌లను. దాటిబీట్ చేస్తూంటే ఎగ్జామినర్స్ అంతా కలసి కట్టుగా పకడ్బందీగా కుట్ర పన్ని క్లినికల్ సైడ్‌కి తోసేసి చేతులు దులిపేసుకుని హాయిగా నిట్టూర్చాడు. ఐతే ఒకసారి పోగుపోయిన అనుభవంతో ఎగ్జామినర్స్ కుట్రల్ని విజయవంతగా భగ్నంచేస్తూ, నిరాటంకంగా పరీక్షలు ఫెయిలవుతూ, చిదానందంగా విద్యార్థి జీవితాన్ని గడుపుతున్నాడు. మధ్యలో రెండు, మూడేళ్ళు శ్రీవారు స్వగ్రామంలో విశ్రాంతి తీసుకోవడం వల్ల మనబాచ్ వాళ్ళకు యీ దివ్యపురుషుని పావన చరితం గురించి తెలియదు, విద్యచెప్తున్నది కుతూహలంగా వింటూంది మానస.

"ఆగవేబాబూ ! అంతభావావేశం, ఉద్వేగం గట్రా ప్రెస్ చేస్తున్నావు. కొంపదీసి ఓ ఛోటా రచయితవైయిపోయి నీ ట్రీట్‌మెంట్‌తో కాకుండా రచనల్తో ప్రజల్ని చంపుతావేమోనని నాకు దడగావుందే" గుండెమీద చెయ్యేసుకుని భయాన్ని అభినయించింది శార్వరి.

"చుప్ ! నువ్వాపవే శార్వరీ ! యింతకీ యితన్ని చూచి మీరంతా ఎందుకింత కకావికలైపోతున్నారో ముందు చెప్పండి ?" అంది మానస.

"నీకా కష్టాల్లేవనుకో మరి, మేమంతా లైబ్రరీని దగ్గరుండి తెరిపించి మళ్ళీ మూసేసేదాకా కుర్చీలకు అంటుకుపోయి పుస్తకాల్ని నూరుకునితాగుతున్న బాపతు కదా ! లైబ్రరీకి వచ్చి ఆడ, మగ తేడా లేకుండా మమ్మల్నందరినీ అష్టకష్టాలు పెడుతున్నారీవిలన్‌గారు. మేము బాత్‌రూమ్‌కో కాంటీన్‌కో వెళ్ళినప్పుడు గప్‌చిప్‌గావచ్చి మా పుస్తకాల్ని దాచేస్తాడు. డబ్బులివ్వమని డబాయిస్తాడు" ముఖాన్ని విచారంగా పెట్టి ముక్కును ఎగబీల్చింది విద్య.

"డబాయిస్తే డబ్బులిచ్చేస్తారా చవటదద్దమ్మల్లారా ? ఎవరికీ వాడిని అడ్డగించే దమ్ముల్లేవా ?" మానస చిటపటలు చూచి నవ్వింది విద్య.

"పిల్లి మెడలో ఎవరు గంట కడ్తారు? ఇతన్తో పెట్టుకుని టైమ్ వేస్ట్ చేసుకునే తెలివితక్కువవాడెవరు ?..." ఈ ప్రశ్నకు జవాబు చెప్పలేక పోయావో నీ తల వెయ్యి వ్రక్కలవుతుంది జాగ్రత్త !" తర్జనితో బెదిరించింది శార్వరి. "చాల్లే ! కనీసం ప్రిన్సిపాల్‌కి రిపోర్టన్నా యివ్వరా ?" కసిరింది మానస. ఆమె అమాయకత్వాన్నిచూచి జాలిగా నవ్వారంతా.

"అయ్యో ! అదీ అయిందే. మా కష్టాలన్నీ విని ఆయనో విలువైన మాటను సెలవిచ్చారు. అతను ప్రేమ బాధితుడట, ప్రేమ విఫలమవడంతో మెంటల్‌గా దెబ్బతిని అలా ప్రవర్తిస్తున్నాట్ట అలాంటి వ్యక్తిమీద కోపం కాక జాలి చూపించాలట !" అంది రజిత.

"చాలా గొప్పగా వుంది సలహా ! యింతకీ అతను మెంటల్‌కేసా ! వేషాలేస్తున్నాడా ?" సందేహం వెలిబుచ్చింది మానస. "రేపు నువ్వోసారలా షికారుగా లైబ్రరీకిరా. నువ్వే డయాగ్నైజ్ చేద్దువుగాని."

మరునాడు కాంటీన్‌లో అతని ప్రవర్తన చూచి అతను మెంటల్‌కేస్ కాదని అందరినీ అదిరించి, బెదిరించి బ్రతకడానికి అలవాటు పడ్డాడని నిర్ధారించుకుంది మానస. అతనిని ఎలా ఎదుర్కోవాలా అని ఆలోచిస్తూ లైబ్రరీలో కూర్చుని మెడికల్ జర్నల్ పేజీల్ని తిప్పుతూంది. తన భుజంమీదుగా చెయ్యిచాచి టేబిల్ మీదున్న పర్స్‌ని తీస్తున్న రాజేష్‌ను చూడగానే మానస శరీరం జుగుప్సతో జలదరించింది.

"యూ బాస్టర్డ్ !" కోపంతో వణుకుతూ అతని చేతిని తోసేసి పర్స్ తీసుకుంది మానస. ఆమె చేతిలోని పర్స్ కోసం అతను పెనుగులాడుతూ వుండడంతో చాచి ఒక్క లెంపకాయ కొట్టింది. లైబ్రరీలో కూర్చున్నవాళ్ళంతా బిలబిల వచ్చి వాళ్ళను చుట్టుముట్టారు. యిద్దరు పి.జి.లు అతన్ని పట్టుకుని అవతలకు లాగారు. అందరివంకా ఛీదరగా చూచింది మానస.

"వీడిలా దాదాగిరి చెలాయించి బ్రతుకుతూంటే మెంటల్ పేషెంట్ అని జాలిపడుతూ వదిలేస్తున్నారా ? యిది జాలి కాదు, నిర్లక్ష్యం, చేతకానితనం. నాలుగు తిడితే వాడి అసలురంగు బయట పడేది కాదూ ?!" రుద్రకాళిలా విరుచుకు పడింది మానస. "అదికాదు మానసా ? పరీక్షల ముందు వాడితో గొడవ పెట్టుకుని ఆ చికాకులన్నీ ఎవరు భరిస్తారు చెప్పు ?" నెమ్మదిగా చెప్పబోయాడు మానస వార్డ్ మేట్ మాధవరావు.

"అలా మాట్లాడడానికి నీకు సిగ్గేయడంలేదూ ? మన చిన్న పరిధిలోని ఈ అరాచకాన్నే ఎదిరించి సరిదిద్దలేని మీరు ఈ సమాజంలో బ్రతకడానికే అనర్హులు. డాక్టర్‌గా జబ్బులతో ఎలా పోరాడాలో తెలుసుకోవడమేకాదు, మనిషిగా అన్యాయాల్నెలా ఎదుర్కోవాలోకూడా తెలుసుకోవాలి. కమాన్ ! నాతో ఎవరొస్తారోరండి. వీడిని ప్రిన్సిపాల్ దగ్గరకు లాక్కురండి" వికసించిన తేజంలా బయటి కడుగు పెడుతున్న మానసవెంట లైబ్రరీలోనివాళ్ళంతా కదిలారు. ♦♦♦